# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

గురువారం | 18 డిసెంబరు, 2025 | పేజీలు :04


## ముధోల్ ఎన్నికల కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/ముధోల్:** మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా,జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ముధోల్ మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న ఎన్నికల తీరును పరిశీలించారు.ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని అన్నారు.

# శాంతి భద్రత పరిరక్షణలో రాజీ పడొద్దు

### కమిషనరేట్‌ను సందర్శించిన ఐ.జి. చంద్రశేఖర్‌రెడ్డి





**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం పోలీస్ కమిషనరేట్‌ను మల్టిజోన్1 ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం సందర్శించారు. కమిషనరేట్‌కు చేరుకున్న ఐ.జి.కి రామగుండం సి.పి. అంబర్ కిషోర్ ఝూ పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఎ.ఆర్. సాయుధ దళ సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించారు. సి.పి. కార్యాలయంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ, చేపట్టాల్సిన భద్రత ఏర్పాట్లు, సున్నిత, సాధారణ పోలింగ్ ప్రక్రియ, ఫలితాల వివరాలు, కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ కోసం చేపడ్తున్న ముందస్తు చర్యలు వంటి అంశాలపై సిపితో ఐ.జి. చర్చించారు.

శాంతి భద్రత పరిరక్షణలో ఎలాంటి రాజీ పడకూడదన్నారు. నేరాల నివారణకు, ఇంటెలిజెన్స్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది క్రమశిక్షణ, ప్రజలతో సమన్వయం, గ్రామాలను సందర్శించి, ఇన్‌ఫర్‌మేషన్ వ్యవస్థ, నిఘా బలోపేతం చేయాలని ఐ.జి. సూచించారు. అనంతరం నిర్మాణ దశలో ఉన్న పోలీస్ కమిషనర్ నివాస గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. పనులు నాణ్యతతో నిర్ధిష్ట గడువులో పూర్తి చేయాలన్నారు.

# ఓటర్లకు ఇబ్బందులు కలగొద్దు

### జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** మూడో విడత ఎన్నికల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్ ప్రక్రియను నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అధికారులను ఆదేశించారు. బుధవారం కాగజ్‌నగర్ మండలం కోసిని ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రం ముఖద్వారాన్ని గ్రీన్ మ్యాట్ అరటి ఆకుల తోరణాలతో అలంకరించి స్వాగతం పలకడం సంతోషంగా ఉందని తెలిపారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. మధ్యాహ్నం 2 గంటల నుండి మొదట వార్డు సభ్యుల స్థానాలకు తర్వాత సర్పంచ్ స్థానాలకు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించాలని తెలిపారు. అనంతరం ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించాలని చెప్పారు. ఎన్నికల సరళి పారదర్శకంగా నిష్పక్షపాతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, తహసిల్దార్ మధుకర్ పాల్గొన్నారు.

# ప్రశాంతంగా మూడవ దశ పంచాయతీ పోలింగ్

### భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించిన జిల్లా ఎస్‌పి



**ప్రజాపక్షం/బైంసా:** జిల్లాలో మూడవ విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య ప్రశాంతంగా కొనసాగుతోంది.ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా,ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేసేలా జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది.ఈ క్రమంలో బైంసా సబ్ డివిజన్ పరిధిలోని పలు సమస్యాత్మక,సాదారణ పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ స్వయంగా సందర్శించి బందోబస్తును పర్యవేక్షించారు.

ముధోల్,బాసర,తానూర్,జౌల(బి),తరోడా,బెల్ తరోడ,దహేగాం,మాహగం,కామోల్ వంటి ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ పరిశీలించారు.ఈ సందర్భంగా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బ్యారికేడింగ్,క్యూలైన్ల నిర్వహణ,సిసి టివీ నిఘా,ప్రవేశ నిష్కమణ మార్గాలను ఆమె క్షుణ్ణంగా తనిఖీ చేశారు.పోలింగ సిబ్బంది,భద్రతా బలగాలు సమన్వయంతో పనిచేయాలని,ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా ఉంటుందని స్పష్టం చేశారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.జిల్లా పోలీస్ శాఖ అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోందని,ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.ఈ పర్యవేక్షణలో జిల్లా ఎస్పీతో పాటు బైంసా ఏఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్,ఇతర పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# కరీంనగర్ లో 86.42 శాతం పోలింగ్



వివరాలు మెయిన్‌లో...

## గ్రామ సర్పంచ్‌ను సన్మానించిన డా.అర్జున్



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** బిజెపి సారంగపూర్ మండల అధ్యక్షుడు పోచంపేట గ్రామ నూతన సర్పంచ్ గా ఎన్నికైన రెంటం జగదీష్ ను బుధవారం రోజున జగిత్యాల జిల్లా కేంద్రంలోని అర్జున్ మెటర్నటీ పిల్లల హాస్పిటల్ పిల్లల వైద్యులు డాక్టర్ గుండేటి అర్జున్ సర్పంచ్ రెంటం జగదీష్ ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సారంగాపూర్ మండల బిజెపి సెక్రెటరీ భాస నాగేంద్ర, కంచర్ల శివ, యువ మోర్చా మండల నాయకుడు దండుగుల వంశీ ఉన్నారు.

## మూడో విడత పోలింగ్ కేంద్రాల పరిశీలన

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :**మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ సరళిని ఆసిఫాబాద్ ఎఎస్పి చిత్తరంజన్, కాగజ్‌నగర్ డిఎస్పి వహీదుద్దీన్ పర్యవేక్షించారు. బుధవారం ఆసిఫాబాద్ రెబ్బెన కాగజ్‌నగర్ మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను వారు వేర్వేరుగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎఎస్పి మాట్లాడుతూ 163 బిఎన్ఎస్ఎస్ అమలులో ఉన్నందున పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరం వరకు ఓటర్లు తప్ప ఇతరులను అనుమతించకూడదని సిబ్బందిని ఆదేశించారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఓట్ల లెక్కింపు బ్యాలెట్ బాక్సుల తరలింపు సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాగజ్‌నగర్ డివిజన్ లోని రాస్పల్లి భట్ పల్లి బారే గూడ కొత్త సరసాల ఇస్గాం గ్రామాల్లో డిఎస్పి వహీదుద్దీన్ పర్యటించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## భారీ బందోబస్తు మధ్య సిర్సాలో పోలింగ్



**ప్రజాపక్షం/కోటపల్లి/ చెన్నూర్ :**మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన సిర్సా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేసినట్లు జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం కోటపల్లి మండలంలోని సమస్యాత్మక ప్రాంతమైన సిర్సా గ్రామ పంచాయతీలో జరుగుతున్న మూడో విడత ఎన్నికల సరళిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో మూడంచెల బందోబస్తును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భారీ పోలీసు బందోబస్తు నడుమ ఎన్నికలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎనిన్కల అనంతరం గెలిచిన ఓడిన అభ్యర్థులు గొడవలకు తావివ్వకుండా సంయమనం పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలి



జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :**ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, రెబ్బెన, తిర్యాణి మండలాల్లో ఏర్పాటు చేసిన పలు పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మూడో విడతలో 104 సర్పంచ్ స్థానాలకు 744 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు త్రాగునీరు విద్యుత్ దివ్యాంగుల కోసం ర్యాంపులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓటింగ్ అనంతరం ఓట్ల లెక్కింపు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించి ఉపసర్పంచ్ ఎన్నికను పూర్తి చేయాలన్నారు. ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

# పెన్షన్ హక్కును కాపాడుకోవాలి

**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :**పెన్షన్ అనేది భిక్ష కాదని అది ఉద్యోగుల హక్కని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జయదేవ అబ్రహాం అన్నారు. బుధవారం కాగజ్ నగర్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో పెన్షనర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.



ఈ సందర్భంగా డిఎస్ నాకారే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జయదేవ అబ్రహాం మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పెన్షనర్లు ప్రశాంతమైన జీవితం గడపడానికి నాకారే చేసిన న్యాయ పోరాటమే కారణమని తెలిపారు. పెన్షన్ అనేది ప్రభుత్వం ఇచ్చే దయాదాక్షిణ్యం కాదని అదొక హక్కని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వైవి చంద్రచూడ్ తీర్పు ఇచ్చారని గుర్తుచేశారు. పెన్షన్ హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత విశ్రాంత ఉద్యోగులపై ఉందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సంఘ కార్యదర్శి శివప్రసాద్, రాజేంద్రప్రసాద్, అంకయ్య, అన్వర్, అహ్మద్, నరసయ్య, మురళీధర్ రావు, పురుషోత్తం, కుమార్, నర్సయ్య, కిషన్, కుమార్, రామయ్య, మురారి, నారాయణ, శివలింగం, సలీం, రామయ్య, శంకర్ పాల్గొన్నారు.

# రైళ్ల నిలుపుదలపై డిఆర్ఎం సానుకూలత

**ప్రజాపక్షం/సిర్పూర్(టి) :**సిర్పూర్ (టి) రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లను నిలిపే విషయమై డిఆర్ఎం గోపాల కృష్ణన్ సానుకూలంగా స్పందించారు. బుధవారం ఆయన రైల్వే స్టేషన్‌ను సందర్శించిన సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ఒడ్డెటి నాగమణి, ఇతర ప్రజాప్రతినిధులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భాగ్యనగర్, ఇంటర్‌సిటీ, హాజిని ప్యాసింజర్‌తో పాటు పలు ఎక్స్‌ప్రెస్



రైళ్లను ఇక్కడ నిలిపేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైళ్ల కోసం కాగజ్‌నగర్‌కు వెళ్లాల్సి వస్తోందని ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రైల్వే స్థలంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలపై స్పందించిన డిఆర్ఎం త్వరలోనే రైళ్ల నిలుపుదలకు, డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఒడ్డెటి నాగమణి నాన్నయ్య వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# పోలీసుల అత్యుత్సాహం.. అభ్యర్థులతో వాగ్వివాదం

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :**మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి అభ్యర్థులతో వాగ్వివాదానికి దిగారు. బుధవారం గోలేటి రెబ్బెన మండలాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఈ సంఘటనలు చోటుచేసుకున్నాయి. సర్పంచ్ అభ్యర్థులకు ఐడి కార్డులు ఉన్నప్పటికీ ఆధార్ కార్డు చూపించాలని పోలీసులు నిలదీశారు. గోలేటి గ్రామపంచాయతీలో బిఆర్ఎస్ అభ్యర్థి అజ్మీర బాబు రావును లోపలికి వెళ్ళనీయకుండా అడ్డుకోవడంతో పోలీసులకు అభ్యర్థికి మధ్య వాగ్వివాదం జరిగింది. రెబ్బెన జెడ్‌పిస్ పోలింగ్ కేంద్రం వద్ద బిఆర్ఎస్ అభ్యర్థి



దుర్గం భరద్వాజ్‌తో పోలీసులు గొడవకు దిగారు. కొందరు పోలీసులు విలేకరులతో కూడా దురుసుగా ప్రవర్తించారు.

## మంత్రి వివేక్‌కు షాక్.. పొక్కూరులో కాంగ్రెస్ ఓటమి

**ప్రజాపక్షం/చెన్నూరు:**చెన్నూరు నియోజకవర్గంలో మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామికి షాక్ తగిలింది. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఆయన ఎంపిక చేసిన పైలట్ గ్రామమైన చెన్నూరు మండలం పొక్కూరు గ్రామంలో కాంగ్రెస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి ఓటమి పాలయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లతో పాటు ఇతర పథకాలు కూడా కాంగ్రెస్ పార్టీని కాపాడలేకపోయాయి. కాంగ్రెస్ అభ్యర్థిపై బిఆర్ఎస్ బలపర్చిన అయిత స్వరూప సత్యనారాయణ రెడ్డి సంచలన విజయం సాధించారు. పైలట్ గ్రామంగా ఎంపిక చేసినా ప్రజలు బిఆర్ఎస్ వైపు మొగ్గుచూపడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. బిఆర్ఎస్ పార్టీని మాజీ ఎంఎల్ఎ బాల్క సుమన్ నాయకత్వాన్ని నమ్మి గెలిపించిన ఓటర్లకు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మండల పార్టీ అధ్యక్షుడు మల్లెల దామోదర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## పోలింగ్ కేంద్రాలను సందర్శించినఎస్‌పి

సిబ్బందికి పలు సూచనలు చేసినఎస్‌పి మహేష గితే



**ప్రజాపక్షం/వీర్నపల్లి:**మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా వీర్నపల్లి, కంచెర్ల, గర్జనపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్‌పి మహేష్ బి.గితే బుధవారం సందర్శించారు. విధులలో ఉన్న సిబ్బందికి భద్రత పరమైన పలు సూచనలు చేశారు. వారి వెంట ఎల్లారెడ్డిపేట సిఐ శ్రీనివాస్ గౌడ్, వీర్నపల్లి ఎస్ఐ వేముల లక్ష్మ ణ్‌లు ఉన్నారు.

## పరిమళించిన మానవత్వం..

వృద్ధురాలిని వీల్ చైర్ లో తీసుకెళ్లి ఓటు వేయించిన ఎస్.ఐ వెంకట్రాజం



**ప్రజాపక్షం / ఎల్లారెడ్డిపేట :** ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉంటూనే పోలీసులు తమలోని మానవత్వాన్ని చాటుకుంటున్నారు. మూడో విడుత ఎన్నికలలో భాగంగా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపురం గ్రామంలోని పోలింగ్ కేంద్రం వద్ద ఒక వృద్ధురాలు తన ఓటు హక్కును వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రానికి రాగ వృద్ధురాలి వయస్సు పై బడటంతో ఆమె నడవలేక ఇబ్బంది పడుతుండటంతో అక్కడే విధుల్లో ఉన్న ఎస్.ఐ వెంకట్రాజం గమనించి వెంటనే స్పందించిన ఆయన స్వయంగా ఆమెను వీల్ చైర్ లో పోలింగ్ కేంద్రం లోపలికి తీసుకెళ్లారు. ఆమెకు స్వేచ్ఛగా ఓటు వేసే ప్రక్రియ పూర్తయ్యే వరకు దగ్గరుండి సహాయం అందించారు. పోలీస్ అంటే సేవకు మరో పేరని దానిని ఎస్.ఐ వెంకట్రరాజం ప్రత్యక్షంగా ప్రజలకు చూపించారని, వృద్ధులకు అవసరమైన సౌకర్యాలు కల్పించిన లక్ష్యంతో ఎస్సై వెంకట్రరాజం చూపిన ఈ సేవా భావం స్థానిక ప్రజలను నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు.

# మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/శంకరపట్నం:**మండల పరిధిలోని లింగాపూర్ గ్రామానికి చెందిన ఇజ్జిగిరి విజేందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బుధవారం వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి,కాచాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ గట్టు తిరుపతి గౌడ్ పరామర్శించి తన వంతు సాయంగా 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ కళాశాలలో స్పోర్ట్స్ లాంజ్ ప్రారంభం

వైస్ చాన్స్ లర్



**ప్రజాపక్షం/కరీంనగర్:**శాతవాహన విశ్వవిద్యాలయంలోని న్యాయ కళాశాలలో స్పోర్ట్స్ లాంజ్ (ఆటలగది) ని ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని న్యాయ విద్యార్థులు తమ ఆటవిడుపు కోసం క్యారమ్స్, చెస్, టేబుల్ టెన్నిస్ వంటి అంతర ఆటలను ఆడి తమ ఆత్మ ధైర్యాన్ని, శారీరకద్రుడత్వాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. వచ్చే సంవత్సరం వరకు న్యాయ కళాశాలకు కొత్త భవనాన్ని నిర్మిస్తామని పురుషులకు, మహిళలకు ప్రత్యేక హాస్టల్ సదుపాయాన్ని కూడా తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నామని తెలియజేశారు. ఈ సందర్భంగా న్యాయ విద్యార్థులతో టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, చెస్ ఆడారు. ఈ కార్యక్రమంలో న్యాయ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సూరేపల్లి సుజాత, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ నజీముద్దీన్ మున్వర్, డాక్టర్ కన్నా, ఫిజికల్ డైరెక్టర్ డి.విజయ్ కుమార్, కుతాడి శీను, న్యాయ కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో పోలింగ్ శాతం 79.14

## మొత్తం 1,25,324 ఓట్లలో పోలైన ఓట్లు 99,183

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మూడో ఫేజ్ ఎన్నికల పోలింగ్ శాతం నమోదు అయింది. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, ముస్తాబాద్, గంభీరావుపేట మండలాల్లో బుధవారం పోలింగ్ నిర్వహించారు. నాలుగు మండలాల్లో కలిపి మొత్తం 1,25,324ఓట్లు ఉండగా, 99,183పోల్ అయ్యాయి. మధ్యాహ్నం ఒంటి గంట వరకు 79.14 శాతం పోలింగ్ నమోదు అయింది.

**మండలాల వారిగా ఓటర్లు.. నమోదు అయిన పోలింగ్ శాతం..**

వీర్నపల్లి మండలంలో మొత్తం ఓటర్లు 11,066 మంది ఉండగా, 9,065మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 81.92 శాతం నమోదు అయింది.

ముస్తాబాద్ మండలంలో మొత్తం ఓటర్లు 37,711 మంది ఉండగా, 30,434 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 80.70 శాతం నమోదు అయింది. గంభీరావుపేట మండలంలో మొత్తం ఓటర్లు 36,135 మంది ఉండగా, 28,816మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 79.75 శాతం నమోదు అయింది. ఎల్లారెడ్డిపేట మండలంలో మొత్తం ఓటర్లు 40,412 మంది ఉండగా, 30,868 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 76.38 శాతం నమోదు అయింది.

# పెద్ద మెజారిటీతో గెలువ లేదన్న కెటిఆర్

## మొదటిసారి కేకే మహేందర్ రెడ్డిపై ఎన్ని ఓట్ల తేడాతో గెలిచినవో మరిచి మాట్లాడుతున్నావ్

## మహిళ విభాగం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** పెద్ద మెజారిటీతో గెలువ లేదన్న కేటీఆర్ నువ్వు మొదటిసారి కేకే మహేందర్ రెడ్డి పైన ఎన్ని ఓట్ల తేడాతో గెలిచావో మరిచిపోయి మాట్లాడుతున్నావని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొన్నటి రోజున సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల నియోజకవర్గంలో సర్పంచ్ ల ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పెద్ద మెజారిటీతో ఏమి గెలవలేదని అనడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. 12 నుండి 14 వేల ఓట్ల మెజార్టీతో గెలిచారని మాట్లాడిన మీరు మొదటిసారిగా సిరిసిల్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు కేకే మహేందర్ రెడ్డి పై 171 ఓట్లతో మాత్రమే గెలిచారని అన్నారు. ఆది శ్రీనివాస్ నాలుగు సార్లు ఓడిపోయినా ప్రజల మధ్య ఉంటూ ప్రజల కష్ట నష్టాలను పంచుకుంటూ ప్రజల మధ్యలోనే ఉన్నారన్నారు. వారానికి రెండు రోజులు ఇక్కడే ఉంటానని సిరిసిల్ల ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలేదు అన్నారు. అలాంటి నువ్వు ఆది శ్రీనివాస్ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాట తప్పారని అన్నారు.

# ఎస్.జి.ఎఫ్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలకు విద్యార్థి ఎంపిక



**ప్రజాపక్షం/కరీంనగర్:**పారమిత ఉన్నత పాఠ శాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎం.చాణక్యన్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక అయ్యాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ తెలిపారు. డిసెంబర్ 15న కరీంనగర్ పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో జిల్లా ఎస్.జి.ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఎస్.జి.ఎఫ్ అండర్ 14 బాలుర బాక్సింగ్ చాంపియన్షిప్ పోటీలలో పారమిత ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న ఎం.చాణక్యన్ 32 34 కిలోల విభాగంలో బంగారు పథకం సాధించి రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైనాడు. రాష్ట్ర స్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో హన్మకొండ పట్టణంలోని జె.ఎన్ స్టేడియంలోని బాక్సింగ్ హాల్ లో డిసెంబర్ 18 నుండి 25 వరకు తేదీలో నిర్వ హించనున్న 69వ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డా॥ ఇనుగంటి ప్రసాదరావు, పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్ రావు, వినోద రావు, వి.యు. ఎం.ప్రసాద్, హనుమంతరావు. ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజీ, కవిత ప్రసాద్ సమన్వయకర్త శ్రీనాథ్ లు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే విద్యార్థని, బాక్సింగ్ కోచ్ ఎ.రామకృష్ణ ను అభినందించారు.

# పోస్ట్ ఆఫీస్ పథకాలపై నేడు అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/ముత్తారం :** పోస్ట్ ఆఫీస్ ద్వారా అందించే పథకాలపై నేడు ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామపంచాయతీ ఆవరణంలో ఉదయం 11 గంటలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఓడేడు పోస్ట్ మాస్టర్ స్వప్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన సదస్సు కార్యక్రమానికి జిల్లా పోస్ట్ బ్రాంచ్ అధికారులు పాల్గొంటారని పోస్ట్ ఆఫీస్ ద్వారా వచ్చే వివిధ పథకాలపై అధికారులు ప్రజలకు విన్నవించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

# విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందన



**ప్రజాపక్షం /మల్లాపూర్:**మండలంలోని కొత్త దామరాజు పల్లి కేరళ హై స్కూల్ విద్యార్థులు తెలంగాణ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి చేతిత్రవత డ్రాయింగ్ పోటీల్లో మెరుగైన ప్రదర్శన కనబరిచి విజయం సాధించగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ విద్యార్థులను బుధవారం అభినందించారు. డ్రాయింగ్ సీనియర్ విభగంలో శ్రీనిత్ జూనియర్ విభాగంలో ఇమ్రాన్ సబ్ జూనియర్ విభాగంలో జాహ్నవి, చేతిత్రవతలో సీనియర్ విభాగం దేవ ప్రియ జూనియర్ విభాగం దీక్షిత సబ్ జూనియర్ విభాగంలో ప్రవర రెడ్డి బహుమతులు పొందగా ఎమ్మెల్యే సంజయ్ విద్యార్థులు అభినందించి బహు మతులను చిహ్నాలను ప్రధానం చేశారు. విద్యార్థి దశ నుండి భవిష్యత్తు లక్ష్యాలను ఎంచుకొని చదువులో రాణించాలని ఎమ్మెల్యే సూచించారు.ప్రధానోపాధ్యాయుల అనిల్ సింగ్ తదితరులున్నారు.

# చలి వణుకుతో ప్రజలు గజ.. గజ..!



**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలో చలి పులి పంజా విసురుతోంది.అధికారులు తెలిపిన వివరాల ప్రకారం గత వారం రోజు నుండి 15 డిగ్రీలకు ఉష్ణోగ్రత పడిపోయిందని చెబుతున్నారు.ఉష్ణోగ్రతలు రోజు రోజుకు తగ్గడంతో ప్రజలు ఎటూ వెళ్లలేక ముసుగు కప్పి ఇంట్లోనే ఉండిపోతున్నారు.. ఉదయం 7 గంటలు దాటుతున్నా సూర్యుడు కనిపించని పరిస్థితి. తెల్లవారుజామున మంచు కురుస్తుండటంతో పనుల నిమిత్తం బయటికి వెళ్లే వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గాలిలో తేమ శాతం పెరిగిపోవడం, వాతావరణంలో వచ్చిన మార్పులతో చలి తీవ్రత పెరిగిందని అధికారులు అంటున్నారు. సాధారణంగా జనవరిలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అలాంటిది ఈ ఏడాది డిసెంబర్ లోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

# ఉపాధి హామీ పథకం దేశ ప్రజల గుండెల్లో నిలిచిపోయింది

## మాజీ మంత్రి తాటి పర్తి జీవన్ రెడ్డి



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో బుధవారం మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి, డిసిసిఅధ్యక్షుడు గాజంగి నందయ్యతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు.

**మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి మాట్లాడుతూ :** అవినీతిని నిలువరించేందుకు, పారదర్శకత కోసం సమాచార హక్కు చట్టం ఉందని మాజీ మంత్రి అన్నారు. నిరుపేద వర్గాల ప్రజలు ఆకలితో అలమటించకూడదని ఆహార భద్రత చట్టం, విద్య ప్రాధాన్యతను గుర్తించి విద్యా హక్కు చట్టాన్ని, గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించాలని ఉపాధి హామీ చట్టాన్ని యూపీఏ ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. సోనియా గాంధీ ఆలోచన, మన్మోహన సింగ్ దార్శనికతతో జాతిపిత మహాత్మ గాంధీ పేరిట జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంగా నామకరణం చేశారని గ్రామీణ ప్రాంత ప్రజలకు పని కల్పించేందుకు ఉపాధి హామీ చట్టం రూపొందించారు జీవన్ రెడ్డి అన్నారు. రెండు దశాబ్దాల కాలంలో ఉపాధి కల్పించడంతో పాటు, ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతంలో చేపట్టే ప్రతి అభివృద్ధి పని ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టారని జీవన్ రెడ్డి గుర్తు చేశారు. హరిత హారం గుంతలు తీయడం, వైకుంఠ ధామాలు, రైతు వేదికలు, డంపింగ్ యార్డులు, పాఠశాలల్లో టాయిలెట్స్, అంగన్వాడీ భవనల నిర్మాణాలు, గ్రామ పంచాయతీ భవన్ నిర్మాణాలు అన్ని ఉపాధి హామీ పథకం నిధులే ఆధారమని మాజీ మంత్రి అన్నారు. ఉపాధి హామీ పథకం దేశ ప్రజల గుండెల్లో నిలిచి పోయింది. గతంలో 100 రోజులు పని దినాలను ప్రస్తుతం 125 దినాలుగా పెంచటం పై మాజీ మంత్రి జీవన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గతంలో వ్యవసాయ రంగానికి కూడా ఉపాధి హామీ అనుసంధానం చేయాలని విజ్ఞప్తి చేశానని వ్యవసాయానికి అనుబంధం చేయడంతో కులీలకు పని లభించడంతో పాటు, రైతులకు మేలు జరుగుతుందని, వ్యవసాయానికి అనుసంధానం చేసి ఉపాధి హామీ పథకానికి మార్పులు చేసి అమలు చేయాలని కోరారు. దేశ స్వాతంత్ర్యం కోసం మార్గదర్శనం చేసిన మహోన్నతుడు మహాత్మ గాంధీ అని, ఉపాధి హామీ పథకానికి మహాత్మ గాంధీ పేరు మార్చాలనే ప్రతిపాదన సరి కాదని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. కేంద్రం గతంలో ఉపాధి హామీ పథకానికి 100 శాతం నిధులు కేటాయించింది. ప్రస్తుతం కేంద్రం 60 శాతం రాష్ట్రం 40 శాతం కేటాయించాలని ప్రతిపాదించడంతో రాష్ట్రాల పై భారం పెరిగి, నిధుల కొరత ఉపాధి హామీ పథకం అమలుకు ఆటంకంగా మరే ప్రమాదం ఉందని, యూపీఏ ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం, రాజీవ్ గాంధీ ప్రవేశపెట్టిన ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయతీలకు హక్కుగా లభిస్తున్నాయని ప్రజల గుండెల్లో ఉన్న నెహ్రూ పేరు తుడిచివేయాలని మోదీకి నెహ్రూ పై ఈర్ష్య ఉండేది అని ఇప్పుడు మహాత్మ గాంధీ పై పడ్డారు అని మాజీ మంత్రి తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో కోదండ రామాలయం నిర్మాణం చేపట్టాం వికసిత భారత్ రాముడి పాలన అనుసరిస్తుందని భావిస్తే వికసిత భారత్ కు వికసిత శ్రీరామ్ అని పేరు పెట్టండి అని మాజీ మంత్రి అన్నారు. మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం మరింత మెరుగు పర్చేందుకు కృషి చేయండి. పేరు మార్చడంతో ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఏమి లేదని మహాత్మ గాంధీపేరు మార్చినా చెరిగేది కాదు ప్రజల గుండెల్లో ఉంటుందని ఉపాధి హామీ పథకానికి మహాత్మ గాంధీ పేరు తొలగించాలని ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలనీ జీవన్ రెడ్డి మరోసారి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## వృద్ధురాలికి అండగా నిలిచిన కానిస్టేబుల్

**ప్రజాపక్షం/కోటపల్లి /చెన్నూరు :** నడవ లేని స్థితిలో ఉన్న ఓ వృద్ధురాలిని కానిస్టే బుల్ ఎత్తుకెళ్లి ఓటు వేయించి మానవత్వం చాటుకున్నారు. బుధవారం మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం సిర్సా గ్రామంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. నడవలేని స్థితిలో ఉన్న ఓ వృద్ధురాలు ఓటు హక్కు విని యోగించుకోవాలనే తపనతో కుటుంబ సభ్యుల సాయంతో పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ ఆమె పరిస్థితిని గమ నించిన విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్ ఆమెను తన చేతులతో ఎత్తుకుని పోలింగ్ కేంద్రం లోపలికి తీసుకెళ్లారు. ఆమె ఓటు వేసేలా పూర్తిస్థాయిలో సహకారం అందిం చారు. వృద్ధురాలి స్ఫూర్తిని పోలీసు కానిస్టే బుల్ సేవను గ్రామస్తులు అభినందించారు.



## విజయోత్సవ ర్యాలీలు నిషేధం

### మంచిర్యాల డిసిపి భాస్కర్

**ప్రజాపక్షం/జైపూర్ :** ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నంతకాలం విజయోత్సవ ర్యాలీలు నిషేధ మని మంచిర్యాల డిసిపి భాస్కర్ స్పష్టం చేశారు. బుధవారం జైపూర్ భీమారం చెన్నూర్ కోటపల్లి, మందమర్రి మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ మూడవ విడత ఎన్నికలు శాంతియుతంగా సాగేందుకు భద్రతా చర్య లను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ ఫలితాల వెల్లడి సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మూడు దశల పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు కోడ్ అమల్లో ఉంటుందని చెప్పారు. ర్యాలీలు బైక్ శోభాయాత్రలు డిజె కార్యక్రమాలు పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ప్రజలు రాజకీయ నాయకులు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిని ఓర్వలేక దుష్ప్రచారం


### ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పై మాజీ మంత్రి కెటిఆర్ మాటలు అవాస్తవం



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌పై కెటిఆర్ చేసిన వ్యాఖ్యలు అవాస్తవం అని ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. బుధవారం ఖానాపూర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసినన ప్రతికా సమావేశంలో వారు మాట్లా డుతూ మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన బిఆర్ఎస్ పార్టీ సమావేశంలో మాజీ మంత్రి కెటిఆర్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. ఖానా పూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కంటే జాన్సన్ నాయక్ నియోజకవర్గంలో ఎక్కువగా అందుబాటులో ఉంటారని, కెటిఆర్ చేసిన వ్యాఖ్యలకు ఎలాంటి వాస్తవాధారం లేదని, ఎమ్మెల్యే ప్రతి రోజు మార్నింగ్ వాక్ కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, వార్డుల్లో తిరుగుతూ ప్రజలతో మమేకమై ప్రత్యక్షంగా సమస్యలు తెలుసుకుని,వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రజ లకు అందుబాటులో ఉంటున్నారని,నియోజకవర్గములో అత్యధికంగా సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలిచిం దని,క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని పంచాయతీ ఎన్నికల్లో ప్రజాబలం స్పష్టంగా నిరూపిత మైందని తెలిపారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక కెటిఆర్ ఇటువంటి మతి భ్రమిత వ్యాఖ్యలు చేస్తున్నారని, మండిపడ్డారు. కెటిఆర్ వ్యాఖ్య లను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని, ఎమ్మెల్యేపై ఆధారం లేని మాటలు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్దుల్ మజీద్, ఆత్మ చైర్మన్ తోట సత్యం, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల జనరల్ సెక్రెటరీ షబ్బీర్ పాషా, పట్టణ అధ్యక్షుడు నిమ్మఅల రమేష్,తర్లపాడ్ సర్పంచ్ సచిన్, ఉప సర్పంచ్ నర్సయ్య, నాయకులు జంగిలి శంకర్, రాజు నాయక్, గూడాల రాజన్న, శేషాద్రి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ మెడికవర్ హాస్పిటల్స్‌లో ఉచిత వైద్య శిబిరం

### నరాల వ్యాధులపై నిపుణుల హెచ్చరిక



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లాలో మారు తున్న జీవనశైలి కారణంగా నరాల సంబంధిత వ్యాధులు (Vascular Disorders) వేగంగా పెరుగుతున్న నేప థ్యంలో సికింద్రాబాద్ మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్మల్‌లో ఉచిత వాస్కులర్ కన్సల్టేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సర్జన్ డాక్టర్ అజయ్, బి.మోసూరు రోగులకు అందుబాటులో ఉండి వైద్య సల హాలు అందించారు. ప్రస్తుతం నిర్మల్, ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో ప్రతి ముగ్గురిలో ఒకరికి చక్కెర వ్యాధి లక్ష ణాలు కనిపిస్తున్నాయని, వీరిలో సుమారు 20 శాతం మంది కాళ్ల నరాల బ్లాకేజీ బారిన పడే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో డయాబెటిక్ ఫుట్ గాయాలను ప్రారంభ దశలో గుర్తించకపోవడం వల్ల చాలామంది కాలు కోల్పోయే పరిస్థితికి చేరుకుంటున్నారని డాక్టర్ హెచ్చరిం చారు. మహిళల్లో దీర్ఘకాలం నిలబడి పనిచేసే స్వభావం వల్ల వేరికోస్ వెయిన్స్‌మానని గాయాలు,కాళ్లు రంగు మారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆయన సూచించారు.ఆధునిక చికిత్సా విధానాల ద్వారా కాలు కోల్పోయే ప్రమాదాన్ని తగ్గించ డమే లక్ష్యంగా మెడికవర్ హాస్పిటల్స్ అ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టింది.

## మినరల్ ఫండ్ కోసం సర్పంచ్‌లు పోరాడాలి

### తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు మడావి వెంకటేశ్వర్



**ప్రజాపక్షం/కాసిపేట :** కాసిపేట మండల అభివృద్ధి కోసం నూతనంగా ఎన్నికైన సర్పంచులంతా రాజకీయా లకు అతీతంగా ఐక్యంగా నిలిచి మినరల్ ఫండ్ కోసం పోరాడాలని తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు మడావి వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. బుధవారం కాసిపేట మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంద ర్భంగా వెంకటేశ్వర్ మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపొం దిన నూతన సర్పంచులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇకపై రాజకీయాలను పక్కనపెట్టి అభివృద్ధి దిశగా అడు గులు వేయాలన్నారు. కాసిపేట మండలానికి చెందిన నిధులు ఇక్కడ వినియోగించకుండా పక్క ప్రాంతాలకు తరలించడమే మండల అభివృద్ధికి ప్రధాన అడ్డంకిగా మారిందన్నారు. దేవాపూర్ సిమెంట్ కంపెనీ నుంచి వచ్చే కోట్ల రూపాయల మినరల్ ఫండ్ కాసిపేటకు దక్కకుండా ఇతర ప్రాంతాలకు మళ్లించడం అన్యాయమన్నారు. సర్పంచులు అందరూ కలిసి మినరల్ ఫండ్‌ను కాసిపేట మండలంలోనే వినియోగించేలా పోరాటం చేయాలని సూచించారు.

మంచిర్యాల నుంచి గోదావరి నీటిని కాసిపేట మండలా నికి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరి నీటిని హైదరాబాద్‌కు తరలిస్తు న్నప్పటికీ సమీపంలో ఉన్న కాసిపేటకు తాగు సాగు నీరు అందించకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. ఈ కార్యక్ర మంలో మల్లేష్ పాల్గొన్నారు.

## నూతన సర్పంచ్‌లకు బోస్లే నారాయణరావు పటేల్ శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుంటాల మండలం లోని లింబ కె,గొల్ల మాడ గ్రామ నూతన సర్పంచ్ లను ముధోల్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు బోస్లే నారాయణరావు పటిల్ వారికి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ చంద్రే,నూతన సర్పం చ్‌లు తదితరులు పాల్గొన్నారు.



## సామాజిక సేవకుడు షేక్ ముజాహిద్‌కు ఉత్తమ సేవా పురస్కారం

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** తెలంగాణ ముస్లిం ఏక్తా అండ్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సంఘం సేవకుడు శేఖ్ ముజా హిద్ కు నిర్మల్ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ పురస్కారం ఇచ్చి ఘనంగా సన్మానించారు.బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాతీయ పెన్షనర్ల దినోత్సవం వేడుకలలో ఆయన సేవ లను గుర్తించి సీనియర్ సివిల్ జడ్జి రాధిక జిల్లా ఖజానా అధికారి సరో జన,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజేందర్ చేతుల మీదుగా మెమొంటో శాలువాతో సన్మానించారు.తెలంగాణ ఏక్తా సోషల్ వెల్ఫేర్ సొసైటీ సేవలను గుర్తించి అన్ని రంగాలలో సేవలు అందిస్తు న్నట్లు ఎం.సీ లింగన్న కృతజ్ఞతలు తెలిపారు.మీ సొసైటీకి ఎప్పుడు అండగా ఉంటానని తెలిపారు.ఇందులో పెన్షన్ల సంఘం జిల్లా అధ్య క్షుడు ఎంసీ లింగన్న,సీనియర్ పాత్రికేయులు ఎంఎ వసిం షకీల్,మహమ్మద్ ఉస్మాన్,పత్తి శివప్రసాద్ సోషల్ మీడియా ఇన్చార్జ ఫాజిల్ హాష్మి తదితరులు ఉన్నారు.



## ఉపసర్పంచ్‌కు ఘన సన్మానం

**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ :** ఖానాపూర్ మండలంలోని సత్తన పల్లి గ్రామ ఉప సర్పంచ్‌గా చైతన్య లక్ష్మ ణ్ ఎన్నికయ్యారు. ఈ సంద ర్భంగా ఉప సర్పంచ్ చైతన్య లక్ష్మ ణ్ ను బుధవారం ఆయన 200809 బ్యాచ్ ఎస్ఎస్సీ మిత్రులు అభినందించి,పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఉపసర్పంచ్‌కు మిఠాయిలు తిని పించారు. ఉప సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్దే లక్ష్యంగా కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మిత్రులు,గ్రామస్థులు ఉన్నారు.

### విజేతలు భీమ్‌గల్ మండలం

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** పిప్రి అరిగెల జనార్ధన్, కాంగ్రెస్
మెండోరా కుంట లక్ష్మి , కాంగ్రెస్
బడాభీమ్‌గల్ విష్ణువర్ధిణి, బిఆర్ఎస్
జాగిర్యాల్ గడలా ప్రసాద్, బిఆర్ఎస్
బాబానగర్ శ్రీరాం అరవింద్, కాంగ్రెస్
కొత్తతండా బాదావత్ లలిత, బీఆర్ఎస్
కుప్కల్ సంపంగి నర్సింగ్, బిజెపి
బాచన్‌పల్లి వన్నెల బాలమణి, కాంగ్రెస్
ఎంజి తండా దేగావత్ అమీనా, గణేష్, బీజేపీ
బాబాపూర్ సమీర్ కాంగ్రెస్
లింగాపూర్ గట్టు ఈశ్వర్ సరస్వతి బీఆర్ఎస్
బెజ్జొరా కార్తీక్ బీఆర్ఎస్
భీంనగర్(దేవక్కపేట్) మాలవత్ పూజ స్వతంత్ర
సికింద్రాపూర్ గంగాధర్‌గౌడ్, బిఆర్ఎస్
పెద్దమ్మ తండా భుక్యా రమేష్, కాంగ్రెస్
దేవన్‌పల్లి లకావత్ శేఖర్, టిఆర్ఎస్
రూప్లతండా సర్ధార్ కాంగ్రెస్
తాళ్లపల్లి భుక్యా రాజారెడ్డి, కాంగ్రెస్
ముచ్కూర్ కొడిగెల శ్రీనివాస్, బిజెపి
చేంగల్ దుమాల మమత రాజు, కాంగ్రెస్
పల్లికొండ పిండి మనుష అశోక్, కాంగ్రెస్
పురాణీపేట్ బుర్ర దేవేందర్‌గౌడ్, స్వతంత్ర
గోన్‌గొప్పుల సేపూర్ చరణ్‌గౌడ్, కాంగ్రెస్